
సాక్షి అనంతపురం

ఆదివారం । 13 । జూలై । 2025



టన్ను చీనీ రూ.18,360

అనంతపురం మార్కెట్ యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18,360, కనిష్టంగా రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



అన్నదాతకు అరకొర మద్దతు

కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరలతో ప్రయోజనం కలిగేలా లేదని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

8లో

గరిష్టం/కనిష్టం
35.8°/22.4°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 12 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

నెట్టికంటుడి సేవలో కేంద్ర సహాయ మంత్రి



ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ

తకల్లు రూరల్: కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ శనివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో మంత్రి కుటుంబ సభ్యుల పేరున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

నేడు ఏఎన్‌ఎం రీ కౌన్సెలింగ్

అనంతపురం మెడికల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సచివాలయ ఏఎన్‌ఎంలకు ఆదివారం రీ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్‌ను ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. సీనియారిటీ ప్రాతిపదికన కౌన్సెలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

రేపు కలెక్టరేట్‌లో 'పరిష్కార వేదిక'



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ (ఫైల్)

అనంతపురం అర్బన్: 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' జిల్లాస్థాయి కార్యక్రమాన్ని ఈనెల 14న సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు.రెవెన్యూభవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు సమర్పించాలని సూచించారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలని కోరారు. అర్జీల స్థితిని 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అర్జీలను meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లోనూ సమర్పించవచ్చని తెలియజేశారు.

ఆంధ్రా సరిహద్దుకు తుంగభద్ర జలాలు

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాలు జిల్లా సరిహద్దులోకి ప్రవేశించాయి. శనివారం రాత్రి 10 గంటలకు ఆంధ్రా సరిహద్దు 105–272 కిలోమీటర్ రెగ్యులేటర్ వద్దకు నీళ్లు చేరుకున్నాయి. ఈ నెల 10న హెచ్చెల్సీకి నీరు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే, హెచ్చెల్సీలో మరమ్మతు, లైనింగ్, బ్రిడ్జిల నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఆంధ్రా సరిహద్దులోని రెగ్యులేటర్ గేట్లను కిందకు దింపడంతో తుంగభద్ర జలాలు సరిహద్దులోనే నిలిచిపోయాయి. లీకేజీ కారణంగా 50 క్యూసెక్కుల వరకు వస్తుండడంతో పనులకు ఇబ్బంది లేకుండా అధికారులు హెచ్చెల్సీ ఒకటో డిస్ట్రిబ్యూటరీ వద్ద మట్టితో అడ్డుకట్ట వేశారు. ఈ నెల 20లోపు మరమ్మతు పనులు పూర్తి చేసి తర్వాత నీటిని తీసుకోనున్నట్లు సమాచారం.

సత్యన్నా.. ఇటు చూడన్నా!

- సర్వజనాస్పత్రిలో దారుణ పరిస్థితులు
- ఉమ్మడి జిల్లాకు పెద్ద దిక్కైన జీజీహెచ్‌లో రోగులకు నరకం
- పోస్టులు భర్తీ కాక, పడకలు సరిపడక తీవ్ర ఇబ్బందులు
- ఓపీల్లో సీనియర్ వైద్యుల ఇష్టారాజ్యం
- మంత్రి సత్యకుమార్ స్పందించక పోవడంపై సర్వత్రా విమర్శలు

సర్వజనాస్పత్రి ఔట్ పేషెంట్	2,500
సర్వజనాస్పత్రి ఇన్ పేషెంట్	1,100



- అనంతపురం సర్వజనాస్పత్రిలోని ఓపీ నంబర్ 9–ఏ(మహిళా విభాగం) ఇది. శనివారం గదికి ఏకంగా తాళాలు వేశారు. దీంతో మహిళలు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. అదేవిధంగా ఆర్థో ఓపీలో కూడా అసిస్టెంట్ ప్రొఫెసర్ అందుబాటులో లేకపోవడంతో ఎస్ఆర్, పీజీ, హౌస్‌సర్జన్ చూసుకోవాల్సి వచ్చింది. సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం సొంత విభాగం పరిస్థితే ఇంత ఘోరంగా ఉందంటే వేరే విభాగాల్లో దుస్థితిని అర్థం చేసుకోవచ్చు.



- ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని రేడియాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు అందుబాటులో లేకపోవడంతో అల్ట్రాసౌండ్ స్కాన్ గది ముందు గర్భిణులు, వృద్ధులు, బాలింతలు, చిన్నారులు వేచి ఉన్న దృశ్యమిది. రేడియాలజీ విభాగాన్ని సీనియర్ వైద్యులు పీజీలకు అప్పగించేశారు. ఈ క్రమంలో శనివారం ఓ గర్భిణీకి సీరియస్‌గా ఉండడంతో అల్ట్రాసౌండ్‌కు తీసుకురాగా విద్యార్థులే స్కానింగ్ తీశారు.

అనంతపురం మెడికల్: కూటమి ప్రభుత్వంలో జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాలు మృగ్యంగా మారాయి. వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నా ఆస్పత్రుల గురించి పట్టించుకోకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. చాలీచాలని పడకలు.. మందుల కొరత.. వైద్యుల నిర్లక్ష్యం వెరసి రోగులు ప్రత్యక్ష నరకం చూస్తున్నా స్పందించకపోవడంపై జిల్లావాసులు పెదవి విరుస్తున్నారు. ఇక.. ఉమ్మడి జిల్లా ప్రజలకు పెద్దదిక్కుగా ఉన్నా అనంతపురం సర్వజనాస్పత్రిలోనే దారుణమైన పరిస్థితులు నెలకొన్నా ఎవరికీ పట్టడం లేదు.



మంత్రి సత్యకుమార్

కొరవడిన పర్యవేక్షణ..

పేదలను దృష్టిలో ఉంచుకుని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన విప్లవాత్మక సంస్కరణలతో అనంతపురం వైద్య కళాశాలలో యూజీ సీట్ల సంఖ్య 200కు చేరడంతో పాటు వందల సంఖ్యలో పీజీ సీట్లు మంజూరయ్యాయి. దీంతో సర్వజనాస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందాయి. కానీ కూటమి ప్రభుత్వంలో 30 పోస్టులు ఇతర ప్రాంతాలకు బదలాయింపు జరగడంతో సేవలు గగనమై పోయాయి. మరోవైపు ఆస్పత్రి ఉన్నతాధికారి పర్యవేక్షణ కొరవవడంతో వైద్య సేవలు అటకెక్కాయి.

సీట్లలో కనిపించరే..?

సర్వజనాస్పత్రిలోని ఆర్థో, సర్జరీ, పల్మనాలజీ, మెడిసిన్, డెర్మటాలజీ, ఈఎన్‌టీ తదితర విభాగాల్లో వైద్యులు పూర్తి స్థాయిలో తమ సీట్లలో కూర్చోవడం లేదు. పీజీలకు బాధ్యతలు అప్పగించి సొంత క్లినిక్‌లు, ఆస్పత్రులపై దృష్టి సారిస్తున్నారు. దీనికితోడు ఆస్పత్రిలో అమాక్సిలిన్, ఆమాక్సీ క్లేవ్ 650 ఎంజీ, లివిప్రిల్, లిథియమ్, పారాసిట్‌మాల్ ఇంజెక్షన్ తదితర 20 రకాల మందులు అందుబాటులో లేవు. ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్‌ఓ తదితర సిబ్బంది పూర్తి స్థాయిలో పని చేయడం లేదు. ఈ క్రమంలో రోగులకు నరకం కనిపిస్తోంది.

4 గంటలైనా రాకుంటే ఎలా?



చేతికి గాయమైంది. సర్వజనాస్పత్రిలో బాగా చూస్తారని వచ్చా. పొద్దున వస్తే ఆలస్యంగానే చూశారు. పరీక్షలు చేసి మధ్యాహ్నం 3 గంటలకంతా చూస్తామన్నారు. మధ్యాహ్నం 2 నుంచే వచ్చి కూర్చున్నా. ఇక్కడేమో ఓపీ నంబర్ 9ఏకు తాళాలు వేశారు. అసలు డాక్టర్ వస్తారో రారో తెలియడం లేదు. 4 గంటలైనా రాకుంటే ఎలా.. తిరిగి నేను ఊరికి ఎప్పుడు వెళ్లాలి?

– వెంకటమ్మ, కాలువపల్లి, బెళగుప్ప మండలం

పేదోళ్లంటే ఇంత అలుసా?



కాలు నొప్పి పెడుతోంది. ఇటీవల మా ఊళ్లో చూపించినా తగ్గలేదు. పెద్దాస్పత్రిలో బాగా చూస్తారని చెప్పారు. ఇక్కడికొస్తే డాక్టర్లు లేరు. ఆస్పత్రికి రావాలని మా ఊర్లో ఉదయం 5 గంటలకే బస్సు ఎక్కి 9 గంటలకు ఆస్పత్రికి వచ్చా. పరీక్షలు రాసి మధ్యాహ్నం చూస్తామన్నారు. కానీ ఇంత వరకు డాక్టర్లు రాలేదు. పేదోళ్లంటే ఇంత అలుసా?

– దేవమ్మ, పెద్దపప్పూరు

ఐఏఎస్ ఉంటేనే సత్ఫలితాలు..

సర్వజనాస్పత్రిలో రోగులకు నాణ్యమైన వైద్యం అందాలంటే ఐఏఎస్ స్థాయి అధికారి పర్యవేక్షణ ఉండాలి. తన క్యాంపు కార్యాలయానికి కూత వేటు దూరంలో ఆస్పత్రి ఉన్నా.. కలెక్టర్ వినోద్ కుమార్ ఏనాడు ఆకస్మిక తనిఖీ చేసిన దాఖలాలు లేవు. ఈ క్రమంలో ఐఏఎస్ స్థాయి అధికారి పర్యవేక్షణ ఉంటే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మంత్రి సత్యకుమార్ కూడా దృష్టి సారించి రోగులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని కోరుతున్నారు.

రామగిరి ఎంపీపీ ఎన్నికకు రాంరాం

- బహిష్కరిస్తున్నట్లు పలువురు ఎంపీటీసీల ప్రకటన
- రెడ్‌బుక్ పాలనలో పేట్రేగిపోతున్న అరాచకాలు
- మహిళలపైనా పెరుగుతున్న దారుణాలు

సాక్షి,టాస్క్‌ఫోర్స్: అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రజాస్వామ్యానికి పాతరేసి అరాచకాలతో పేట్రేగిపోతున్నందున రామగిరి ఎంపీపీ ఎన్నికను బహిష్కరిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు వెంకటలక్ష్మమ్మ, బాలకొండప్ప, సాయిలీల, సుజాతమ్మ, భారతమ్మ, ఆదిలక్ష్మి ప్రకటించారు. ఈ మేరకు వారు శనివారం వేర్వేరుగా 'సాక్షి'తో మాట్లాడారు. ప్రస్తుతం రాజుల పాలన, బ్రిటిష్ పాలనకు మించి దుర్మార్గమైన రెడ్‌బుక్ పాలన సాగుతోందన్నారు. దారుణాలు, దౌర్జన్యాలు మితిమీరిపోతున్నాయంటూ ఇటీవల జరిగిన పలు ఘటనలను ఉదహరించారు. దళిత బాలికపై పలువురు సామూహికంగా నెలల తరబడి లైంగిక దాడికి పాల్పడటం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిందన్నారు. అటువంటి రామగిరిలో రెండు దఫాలు అవాంఛనీయ ఘటనలతో వాయిదాపడిన ఎంపీపీ ఎన్నికకు ప్రభుత్వం మూడోసారి ఈ నెల 16న నిర్వహించేందుకు నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యి.. శాంతిభద్రతలు పూర్తిగా అదుపుత ప్పాయన్నారు. ఈ క్రమంలో కురుబ లింగమయ్య హత్యకు గురికావడం.. ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్ పాపిరెడ్డిపల్లికి వచ్చినప్పుడు పోలీసుల వైఫల్యంతో హెలిప్యాడ్ సంఘటన జరిగిందన్నారు. ఎంపీపీ ఎన్నికకు సంబంధించి అప్పట్లో రామగిరి ఎంపీ డీఓ కార్యాలయంలో అనెగ్జర్ లెటర్ ఇవ్వడానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడిచేయడం, అనంతరం మహిళా ఎంపీటీసీ సభ్యురాలను బెదిరించి టీడీపీ నాయకులు తీసుకెళ్లడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయని వివరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో మూడోసారి జరగనున్న ఎంపీపీ ఎన్నికను తాము మూకుమ్మడిగా బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. రెడ్‌బుక్‌ను పక్కనపెట్టి అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని అనుసరించి ప్రజాస్వామ్యం పరిఢవిల్లేలా అధికార యంత్రాంగం పనిచేయాలని ఆకాంక్షించారు.

పంటల బీమా పథకంపై గందరగోళం

- ఇప్పటికే 60 శాతం పూర్తయిన పంట రుణాల రెన్యూవల్స్
- ప్రీమియం కట్టించుకున్న బ్యాంకర్లు
- కేవలం వేరుశనగకే వసూలు
- ఇటీవల పంటల వారీ బీమా ప్రీమియంపై వ్యవసాయశాఖ ప్రకటన
- ప్రభుత్వ తీరుపై రైతుల ఆగ్రహం

రైతులతో చెలగాటం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకానికి మంగళం పాడారు. ఖరీఫ్, రబీ ఆరంభం కాగానే కచ్చితమైన విధి విధానాలు,ప్రీమియం, కటాఫ్ తేదీలు ప్రకటించలేదు. ఈ క్రమంలో పంటల బీమా పథకంపై రైతుల్లో గందరగోళం నెలకొంది. ఎటూ పరిహారం ఇచ్చేది లేదనే ఉద్దేశంతో చెలగాటమాడుతున్నట్లు కనిపిస్తోంది. గతంలో అన్నదాతలకు ఇబ్బంది లేకుండా సాఫీగా అమలు చేసిన బీమా పథకంపై అంతులేని అలసత్వం ప్రదర్శిస్తూ చంద్రబాబు సర్కారు రైతులను దారుణంగా మోసం చేస్తోంది.

అనంతపురం అగ్రికల్చర్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని చంద్రబాబు సర్కారు అటకెక్కించిది. ప్రీమియం కట్టాలంటూ రైతులపై అదనపు భారం మోపింది. ఏటా ప్రీమియం రూపంలో రూ.150 కోట్ల వరకు రైతుల నుంచి దండుకునేందుకు ఎత్తులు వేసింది. కానీ పరిహారం విషయానికి వచ్చే సరికి చేతులెత్తేస్తోంది. 2023కు సంబంధించి 2024లో ఎగ్గొట్టింది. 2024 ఖరీఫ్‌కు సంబంధించి పరిహారం ఇవ్వకుండా దాటవేస్తోంది. నేడు ఖరీఫ్ 2025 బీమా పథకం అమలులోకి తెచ్చింది. ఇలా పంటల బీమా పథకం ప్రయోజనాలు రైతులకు దక్కకుండా మొక్కుబడి తంతుగా మార్చేసింది.

రెన్యూవల్స్ 60 శాతం పూర్తి..

పంట రుణాల రెన్యూవల్స్ సమయంలో రైతుల నుంచి పంటల వారీగా ప్రీమియం కట్టించుకోవాల్సి ఉంది. కానీ కొన్ని బ్యాంకుల్లో ప్రీమియం కట్టించుకోలేదు. మరికొన్ని బ్యాంకులు రైతుల నుంచి ప్రీమియం కట్టించుకుంటున్నా... ఎకరాకు రూ.640 ప్రకారం కేవలం వేరుశనగ పంటకు వసూలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. పంటలు చేసినట్లు ఈ–క్రాప్‌లో వేరుశనగ నమోదైతే బీమా పథకం వర్తిస్తుంది. వేరే పంట వేస్తే సాంకేతిక సమస్య ఉత్పన్నమవుతాయని చెబుతున్నారు.



ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 60 శాతం వరకు పంట రుణాల రెన్యూవల్స్ పూర్తయ్యాయి. ఇలా... 60 శాతం రెన్యూవల్స్ పూర్తయిన తర్వాత నాలుగు రోజుల క్రితం వ్యవసాయశాఖ పంటల వారీగా ప్రీమియం కట్టాలంటూ ప్రకటన విడుదల చేయడం గమనార్హం. రైతుల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి లేకుండా అటు కూటమి ఇటు వ్యవసాయశాఖ వ్యవహరిస్తుండటంతో రైతులకు పరిహారం దక్కే పరిస్థితి కనిపించడం లేదు.

12 పంటలకు..

కాగా ఈ ఖరీఫ్‌లో పంట దిగుబడుల ఆధారంగా ప్రధానమంత్రి ఫసల్‌బీమా కింద కంది, వరి, జొన్న, మొక్కజొన్న, ఆముదం, ఎండుమిరప పంటలకు బీమా పథకం వర్తింపజేశారు. ఇందులో కంది రైతులు ఎకరాకు 80 ప్రకారం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. వరి రైతులు రూ.164, జొన్నకు రూ.84, మొక్కజొన్నకు రూ.132, ఆముదం రూ.80, ఎండుమిరప రూ.576 ప్రకారం ప్రీమియం చెల్లించాలి. ఇక వాతావరణ బీమా పథకం కింద వేరుశనగ, పత్తి, దానిమ్మ, బత్తాయి, టమాట, అరటికి వర్తింపజేశారు. ఇందులో వేరుశనగ ఎకరాకు రూ.640 ప్రకారం ప్రీమియం కట్టాలి. పత్తికి రూ.1,140, దానిమ్మ రూ.3,750, చీనీ, బత్తాయి రూ.2,750, టమాట రూ.1,600, అరటి రూ.3 వేల ప్రకారం ప్రీమియం కట్టాలంటూ ఇటీవల వ్యవసాయశాఖ ప్రకటన విడుదల చేసింది. పంట రుణాలు తీసుకోని రైతులు ప్రత్యేకంగా కామన్ సర్వీసు సెంటర్లు (సీఎస్‌సీ), అలాగే నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ (ఎన్‌సీఐపీ)లో ప్రీమియం కట్టాలని సూచించారు. వాతావరణ బీమా కింద చేర్చిన పంటలకు ఈనెల 15వ తేదీలోపు ప్రీమియం కట్టాలని నాలుగు రోజుల కింద ప్రకటన విడుదల చేయడం గమనార్హం. రైతుల సంక్షేమం పట్ల కూటమి సర్కారు, వ్యవసాయ శాఖ ఎంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నాయనడానికి ఇంతకన్నా నిదర్శనమేముంటుందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

రమణీయం.. రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం (ఇన్‌సెట్‌లో) ప్రత్యేక అలంకరణలో భీమలింగేశ్వరస్వామి

విడపనకల్లు: మండలంలోని గడేకల్లు గ్రామంలో శనివారం వేముల వాడ భీమలింగేశ్వరస్వామి మహా రథోత్సవం రమణీయంగా సాగింది. తెల్లవారు జామున భీమలింగేశ్వరస్వామి ఉచ్చాయం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారిని అర్చకులు వేద మంత్రోచ్చారణల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం రథంలో ఆశీలను లను గావించి ఉత్సవం ప్రారంభించారు. బసవన్న గుడి వరకు సాగిన రథోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో భీమలింగేశ్వర స్వామికి కానుకలు సమర్పించారు.

కి'లేడీ'ల హస్తలాఘవం

- జ్యువెలరీ దుకాణంలో రూ. 50 వేల నెక్లెస్ చోరీ



నెక్లెస్ సెట్ దొంగిలించి ఉడాయిస్తున్న మహిళలు

అనంతపురం: కి'లేడీ'లు హస్తలాఘవం ప్రదర్శించారు. రూ. 50 వేల విలువైన నెక్లెస్ చోరీ చేసి ఉడాయించారు. ఆలస్యంగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలు.. అనంతపురం నగరంలోని కమలానగర్‌లో ఉన్న అన్నపూర్ణ జ్యువెలర్స్ దుకాణానికి శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ముగ్గురు మహిళలు వచ్చారు. కొద్దిసేపు నగలను పరిశీలిస్తున్నట్లు నటించారు. జ్యువెలరీ సిబ్బందిని ఏమార్చి ఒక గ్రాము గోల్డ్‌తో తయారైన రూ.50 వేల విలువ చేసే నెక్లెస్ బాక్స్‌ను తమ వెంట తెచ్చిన బ్యాగులో వేసుకుని బయటకు వెళ్లిపోయారు. దుకాణదారులు గుర్తించేలోపు కిలేడీలు అక్కడి నుంచి ఉడాయించారు. ఇదంతా అక్కడి సీసీ టీవీ కెమెరాల్లో రికార్డయింది. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు దుకాణ యజమానులు తెలిపారు.

'మెగా పీటీఎం'లో చిత్రవిచిత్రాలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇటీవల నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) 2.0లో చోటు చేసుకున్న చిత్రవిచిత్రాలు బయటకు వస్తున్నాయి. 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు'లో చోటు దక్కించుకోవాలనే లక్ష్యంతో ఈనెల మెగా పీటీఎం నిర్వహించారు. అంతకుముందు సుమారు 10 రోజుల పాటు రాష్ట్ర స్థాయి నుంచి పాఠశాల హెచ్‌ఎం వరకు కార్యక్రమ నిర్వహణపై పెద్ద కసరత్తే చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఒత్తిళ్లతో దిక్కుతెలీని హెచ్‌ఎంలు అడ్డగోలు వీడియోలు అప్‌లోడ్ చేసి మమ అనిపించారు.

ఎలా పడితే అలా..


40 నిమిషాల నిడివిగల వీడియోలు అప్‌లోడ్ చేయాలనే ఆదేశాలను చాలామంది పట్టించుకోలేదు. 25,30, 35 సెకన్లు ఉన్నవాటిని అప్‌లోడ్ చేశారు. ఈ క్రమంలో చిత్ర విచిత్రాలను గుర్తించిన రాష్ట్ర అధికారులు వాటిని సరి చేసేందుకు అన్ని జిల్లాల నుంచి బృందాలను పంపాలంటూ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో జిల్లా నుంచి సుమారు 10 మంది టీచర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు శనివారం రాజధానికి బయలుదేరి వెళ్లారు.

తీవ్ర ఒత్తిళ్లతోనే..

ముందుగా ఉదయం 10–12 గంటల మధ్య జరిగిన కార్యక్రమానికి సంబంధించి లైవ్‌లో 40 సెకన్ల వీడియోను 'లీప్' యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలు జారీ చేశారు. ఈ సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా అందరూ ఒకేమారు ప్రయత్నించడంతో సర్వర్ సతాయించి యాప్ పని చేయలేదు. దీంతో వీడియోలు అప్‌లోడ్ చేయని వారిపై...ఎంఈఓతో పాటు జిల్లా కేంద్రంలోని కమాండ్ కంట్రోల్ నుంచి ఫోన్లు చేసి ఒత్తిళ్లు చేశారు. 'సమయం ముగుస్తోంది... తర్వాత మీ ఇష్టం' అంటూ బెదిరించే ధోరణిలో మాట్లాడడంతో చాలామంది హెచ్‌ఎంలు ఎవరు చూస్తారులే అనుకుని ఏదిపడితే అది వీడియో అప్‌లోడ్ చేశారు. అలాగే విట్‌నెస్ (సాక్షి)గా నియమించుకున్న ఇతర శాఖల ఉద్యోగులే స్కూల్‌లో కార్యక్రమం జరిగినట్లు నిర్ధారించాల్సి ఉంది. ప్రభుత్వమే ఒక స్టేట్‌మెంట్ రూపొందించి పంపింది. దీన్ని విట్‌నెస్‌గా ఉండే ఉద్యోగి భర్తీ చేసి అప్‌లోడ్ చేయాల్సి ఉంది. చాలాచోట్ల ఖాళీ పేపర్లను అప్‌లోడ్ చేశారు. మరికొంద రైతే సంబంధం లేని పేపర్లను పీడీఎఫ్ చేసి అప్‌లోడ్ చేసేసి చేతులు దులుపుకొన్నారు. ఇక్కడితో తమ పని అయిపోతుందని హెచ్‌ఎంలు, విట్‌నెస్‌గా ఉన్న ఉద్యోగులు భావించారు. తప్పిదాలను గుర్తించిన రాష్ట్ర అధికారులు వాటిని సరిచేసేందుకు జిల్లాల నుంచి రావాలంటూ ఆదేశాలు జారీ చేయడం జిల్లా విద్యాశాఖలో చర్చనీయాంశంగా మారింది.

అన్నదాతకు అరకొర మద్దతు

- వరి ధాన్యానికి కేవలం రూ.69 పెంపు
- రూ.480 పెంచి వేరుశనగకు మద్దతు ధర క్వింటా రూ.7,263
- కంది రూ.8 వేలు, పత్తికి రూ.8,110, మొక్కజొన్న రూ.2,400
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న రైతులు



అనంతపురం అగ్రికల్చర్: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ముందస్తుగా 2025 ఖరీఫ్ పంట ఉత్పత్తులకు ప్రకటించిన కనీస మద్దతు ధర (మినిమం సపోర్ట్ ప్రైసెస్–ఎంఎస్‌పీ)లు రైతులకు పెద్దగా ప్రయోజనం కలిగేలా లేవని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అటు కేంద్రం .. ఇటు రాష్ట్రంలో కూటమి సర్కారు అన్నదాత సంక్షేమానికి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వడం లేదనడానికి మద్దతు ధరలే నిదర్శనమని గుర్తు చేస్తున్నారు. పంటల వారీగా రైతులు పెడుతున్న పెట్టుబడులు, వస్తున్న దిగుబడులు, మార్కెట్‌లో పలుకుతున్న ధరలు, రైతులకు లభిస్తున్న నికరాదాయం... తదితర గణాంకాలు పరిగణలోకి తీసుకుని దేశవ్యాప్తంగా గత ఐదేళ్లుగా ఖరీఫ్ పంటలకు ముందస్తుగానే ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటిస్తున్న విషయం తెలిసిందే.

వరికి నామమాత్రం

ఈ సారి ఖరీఫ్‌కు సంబంధించి ఇటీవల 17 పంటలకు కేంద్రం ఎంఎస్‌పీ ప్రకటించింది. అందులో వరి ధాన్యానికి పెద్దగా ప్రయోజనం లేకుండా గతేడాది కన్నా కేవలం రూ.69 పెంచడంపై రైతులు పెదవి విరుస్తున్నారు. వేరుశనగ విషయానికి వస్తే గతేడాది కన్నా రూ.480 పెంచి క్వింటా రూ.7,263 ఖరారు చేశారు. అలాగే గతేడాది కన్నా పత్తికి రూ.589, కందులకు రూ.450, మొక్కజొన్నకు రూ.175 మేర పెంచారు.

ఎంఎస్‌పీ లేకుంటే కొనుగోళ్లు

ఖరీఫ్ పంట ఉత్పత్తులు చేతికొచ్చిన సమయంలో బహిరంగ మార్కెట్‌లో ఎంఎస్‌పీ కన్నా తక్కువగా ధరలు ఉంటే.. వరి, వేరుశనగ, కంది, జొన్న, మొక్కజొన్న, కొర్రలు, రాగులు, సజ్జలు, పత్తి తదితర పంట ఉత్పత్తులను ఆర్‌బీకే వేదికగా రైతుల నుంచి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అందుకు వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ సహకారంతో పౌరసరఫరాలశాఖ, మార్క్‌ఫెడ్, నాఫెడ్, ఏపీ సీడ్స్, ఆయిల్‌ఫెడ్, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తదితర కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన నోడల్ ఏజెన్సీలు, కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి 15 రోజుల్లోగా రైతులకు సొమ్ము జమ చేయాల్సి ఉంటుంది. అయితే గతేడాది చంద్రబాబు ప్రభుత్వం అరకొరగా కందులు, ధాన్యం మాత్రమే కొనుగోలు చేసి మిగతావి ఏమీ కొనుగోలు చేయకపోవడంతో రైతులు అందినకాడికి పంటలు అమ్మేసుకుని నష్టపోయారు.

పంటల వారీగా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) వివరాలిలా..

పంట	గతేడాది	ఈఏడాది	పెరిగిన ధర (రూ.లో)
వరి (సాధారణం)	2,300	2,369	69
వరి (ఏ-గ్రేడు)	2,320	2,389	69
మొక్కజొన్న	2,225	2,400	175
జొన్న (మాల్దండి)	3,421	3,749	328
జొన్న (హైబ్రీడ్)	3,371	3,699	328
సజ్జలు	2,625	2,775	150
పెసలు	8,682	8,768	86
మినుములు	7,400	7,800	400
నువ్వులు	9,267	9,846	579
పొద్దుతిరుగుడు	7,280	7,721	441
సోయాబీన్	4,892	5,328	436

క్లుప్తంగా

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్


విజయ్‌కుమార్‌రెడ్డిని అరెస్టు చూపుతున్న పోలీసులు

బొమ్మనహాళ్: మండలంలోని కొలగానహళ్లికి చెందిన అనంతరాజుపై హత్యాయత్నం ఘటనలో మైలాపురానికి చెందిన చింతకుంట విజయ్‌కుమార్‌రెడ్డిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొలగానహళ్లికి చెందిన అనంతరాజు కొంతకాలంగా మైలాపురం గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంపై వివాదం తలెత్తి ఈనెల 7న అనంతరాజుపై చింతకుంట విజయ్‌కుమార్‌రెడ్డి దాడి చేసి గాయపరిచాడన్నారు. అనంతరాజు, ఆయన బంధువులు మైలాపురం చేరుకొని విజయ్‌కుమార్‌రెడ్డి ఇళ్లల్లోకి చొరబడి సామగ్రిని ధ్వంసం చేయడంతో పాటు వరి గడ్డికి నిప్పు పెట్టి ఆస్తి నష్టం చేశారని పేర్కొన్నారు. ఆస్తి నష్టం చేసిన 21 మందిని అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు పంపించామన్నారు. అనంతరాజుపై దాడికి పాల్పడిన విజయ్‌కుమార్ రెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని వెల్లడించారు. శనివారం మైలాపురం గ్రామంలో విజయ్‌కుమార్‌రెడ్డిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. సమావేశంలో ఏఎస్‌ఐ హనుమంతరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతుడు విజయభాస్కర్‌రెడ్డి

యాడికి: ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని చందన – దైవాలమడుగు గ్రామాల మధ్య శనివారం చోటు చేసుకుంది. సీఐ ఈరన్న వివరాల మేరకు.. వైఎస్సార్ జిల్లా పులివెందుల తాలూకా సింహాద్రిపురం మండలం చెర్లోపల్లికి చెందిన చెందిన విజయభాస్కర్‌రెడ్డి (40)కి భార్య అమరావతి, కుమారుడు చంద్రమౌళి రెడ్డి, కుమార్తె సుప్రజ ఉన్నారు. విజయభాస్కర్‌రెడ్డి 20 ఏళ్లుగా నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం ప్యాపిలి సమీపంలో ఉన్న అరుణాచలం లారీ ట్రాన్స్‌పోర్టులో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 20 రోజులుగా డ్యూటీ చేసిన ఆయన శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో డ్యూటీ దిగి తన ద్విచక్ర వాహనంలో ఇంటికి బయలుదేరాడు. అయితే డోన్ రాయల చెరువు రోడ్డు మార్గంలో చందన గ్రామ సమీపంలో ఉన్న మూలుపుల దగ్గర వాహనం అదుపు తప్పి వ్యవసాయ తోటలో పడి విజయభాస్కర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల ద్వారా శనివారం ఉదయం సమాచారం అందుకున్న సీఐ ఈరన్న సిబ్బందితో వెళ్లి మృతుడి సెల్‌ఫోన్ ద్వారా మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతుడి భార్య అమరావతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటికి వస్తూ.. తిరిగిరాని లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి
- కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు


బాలాజీ మృతదేహం వద్ద విలపిస్తున్న తండ్రి చలపతి (ఇన్‌సెట్‌లో) బాలాజీ (ఫైల్)

బుక్కరాయసముద్రం: కుమారుడిని ఉన్నత స్థానంలో చూడాలని ఆ తల్లిదండ్రులు కలగన్నారు. అందుకే పెద్ద చదువులు చదివించారు. మంచి ఉద్యోగం సాధించేలా కుమారుడి వెన్నంటే ఉండి ప్రోత్సహించారు. అతనూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావడంతో వారి ఆనందానికి హద్దుల్లేకుండా పోయాయి. అయితే దేవుడు చిన్నచూపు చూడటంతో వారి సంతోషం ఎక్కువ రోజులు నిలబడలేదు. రోడ్డు ప్రమాదంలో కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో వారు కన్నీరు మున్నీరవుతున్నారు. వివరాల్లోకెళితే.. చలపతి, జయమ్మ తాడిపత్రి పట్టణంలో నివాసం ఉంటున్నారు. చలపతి ఓ గ్రానైట్ షాపులో రైటర్‌గా పని చేస్తున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు పెళ్లి చేశారు. కుమారుడు కడవ బాలాజీ (26) బెంగళూరులోని టెక్ మహేంద్రలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. 15 రోజులు ఆఫీసులో.. 15 రోజులు వర్క్‌ఫ్రం హోం చేసేవాడు. ఇందులో భాగంగా శనివారం తెల్లవారు జామున బెంగళూరు నుంచి రాయల్ ఎన్‌ఫీల్డ్ (బుల్లెట్) బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. అయితే బుక్కరాయసముద్రం మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో అనంతపురం – తాడిపత్రి జాతీయ రహదారిపై కుక్క అడ్డువచ్చింది. దాన్ని తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో బాలాజీ తలకు బలమైన గాయం తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. తలకు హెల్మెట్ ఉన్నా ప్రాణాలను కాపాడలేకపోయింది. విషయం తెలుసుకున్న తండ్రి చలపతి సంఘటనా స్థలానికి చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు. కుమారుడికి పెళ్లి సంబంధాలు చూస్తున్నామని, ఇంకా కొన్ని రోజులు ఆగండి నాన్నా... మంచి జీతం వస్తుందని చెప్పేవాడని , ఏదీ జరగకుండానే అప్పుడే నూరేళ్లు నిండాయా అని రోదించడం పలువురిని కంటతడి పెట్టించింది. సీఐ పుల్లయ్య ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తామని మోసం

యాడికి: ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తామని మోసం చేసిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాలమేరకు.. మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలో నివసిస్తున్న వేములపాడు యజ్ఞాన్ బాషా తన కుమార్తె ఎంబీబీఎస్ సీటు కోసం విజయనగరం జిల్లాకు చెందిన రామారావు, గణేష్‌లకు 2021 సంవత్సరంలో రూ.3,30,000 ఇచ్చారన్నారు. కరోనాతో కాలేజీలు మూత పడ్డాయని, కాలేజీలు తెరిచిన వెంటనే సీటు కచ్చితంగా వస్తుందని నమ్మించినట్లు తెలిపారు. నాటి నుంచి నేటికీ కూతురు చదువుకు ఇచ్చిన డబ్బులు వెనక్కి ఇవ్వలేదన్నారు. యజ్ఞాన్ బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతు ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న వెంకటనారాయణ


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సోమ్లానాయక్

గుత్తి రూరల్: మండలంలోని వన్నేదొడ్డికి చెందిన గొల్ల వెంకటనారాయణ శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల వివరాలమేరకు.. వన్నేదొడ్డికి చెందిన వెంకటనారాయణ కొన్ని నెలలుగా కుటుంబ సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో తీవ్ర మనోవేదనకు గురైన వెంకటనారాయణ గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి వేరుశనగ పంటలకు పిచికారీ చేసే పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పక్క పొలాల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పొలంలో అపస్మారకస్థితిలో పడి ఉన్న వెంకటనారాయణను వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురంకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పులబాధ తాళలేక మరొకరు..

గుత్తి రూరల్: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం మిద్దె తండాకు చెందిన సోమ్లానాయక్ అనే రైతు అప్పుల బాధ తాళలేక శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల వివరాలమేరకు.. సోమ్లా నాయక్ పంటల సాగుతో పాటుగా కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు పండకపోవడంతో తీవ్రంగా నష్టపోయాడు. అక్రమంలో అప్పులు ఇచ్చిన వారు చెల్లించాలని ఒత్తిడి అధికమైంది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన సోమ్లానాయక్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పురుగుల మందు డబ్బాతో అపస్మారక స్థితిలో పడి ఉన్న సోమ్లానాయక్‌ను గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పంటల సాగులో మెలకువలు అవసరం

- కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి


వ్యవసాయ పరికరాలను అందిస్తున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లేశ్వరి

బుక్కరాయసముద్రం: పంటల సాగులో మెలకువలు ఎంతో అవసరం అని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త మల్లేశ్వరి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని రెడ్డిపల్లి కేవీకేలో అటారి, హైదరాబాద్ ప్రిన్సిపల్ సైంటిస్టు రెడ్డికి రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు, మెలుకువలు తప్పక పాటించాలన్నారు. కస్టమ్ హైరింగ్ సెంటర్ ప్రాముఖ్యతను వివరించారు. షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా కస్టమ్ హైరింగ్ సెంటర్ కింద రైతులకు పనిముట్లను అందజేశారు. కార్యక్రమంలో కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి, సస్య ఉత్పత్తి శాస్త్రవేత్త శశికళ, డాక్టర్ మాధవి వెటర్నరీ శాస్త్రవేత్త, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త చందన తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానంతోనే ఉద్యోగావకాశాలు

- దక్షిణ మధ్య రైల్వే అడిషనల్ బోర్డు మెంబర్ విజయ్ ప్రతాప్ సింగ్


కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న రైల్వే బోర్డు సభ్యులు విజయ్‌ప్రతాప్‌సింగ్

గుత్తి: ప్రపంచమంతా కంప్యూటర్ చుట్టే తిరుగుతోందని దక్షిణ మధ్య రైల్వే అడిషనల్ బోర్డు మెంబర్ విజయ్ ప్రతాప్ సింగ్ అన్నారు. గుత్తిలోని కర్నూలు రోడ్డులో ఉన్న జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో వెబ్‌టెక్ కంపెనీ కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. ఈ ల్యాబ్‌ను విజయ్‌ప్రతాప్ సింగ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమన్నారు. కంప్యూటర్ జ్ఞానం ఉంటే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉంటాయన్నారు. రోజూ కనీసం గంట పాటైనా కంప్యూటర్ నేర్చుకోవాలన్నారు. కంప్యూటర్ జ్ఞానం ఉంటే కచ్చితంగా ఉన్నత స్థానాలకు చేరువకావచ్చన్నారు. సాధారణ విద్యతో పాటు కంప్యూటర్ విద్యను కూడా నేర్చుకోవాలన్నారు. అనంతరం డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి, వెబ్‌టెక్ కంపెనీ ప్రతినిధి నిరంజనీస్, సీనియర్ డీఎంఈ ప్రమోద్, హెచ్ఎం సుంకన్న కంప్యూటర్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో రైల్వే ఉన్నతాధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వెబ్‌టెక్ సిబ్బంది పాల్గొన్నారు.

చెక్ డ్యామ్ ప్రారంభం

గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లి వద్ద చెక్ డ్యామ్‌ను రైల్వే బోర్డు మెంబర్ విజయ్ ప్రతాప్ సింగ్ ప్రారంభించారు. అనంతరం డీజిల్ షెడ్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏడీఎంఈ అశోక్ గౌడ్, ఎస్ఎస్ఈ మనోజ్ , గోవిందరాజులు, రాజేంద్రప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం

గుంతకల్లు: రైల్వే ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు రైల్వే బోర్డు అడిషన్ మెంబర్ విజయ్‌ప్రతాప్‌సింగ్ తెలిపారు. శనివారం ఆయన గుంతకల్లులో పర్యటించారు. స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఉన్న రైల్ కోచ్ రెస్టారెంట్‌ను తనిఖీ చేశారు. విజయ్‌ప్రతాప్‌సింగ్ గుంతకల్లు డీఆర్‌ఎంగా ఉన్న సమయంలో రైల్వేస్టేషన్, రైల్వే ఆస్పత్రి, రైల్వే క్రీడామైదనంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో తనదైన ముద్ర వేసిన విషయాన్ని స్థానిక ఉద్యోగులు ఆయన దృష్టికి తీసుకెళ్లి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన డీజిల్ షెడ్‌లోని నూతన బిల్డింగ్‌ను ప్రారంభించారు. ఆవరణలో మొక్కలు నాటారు. రన్నింగ్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వేలో కీలకమైన రన్నింగ్ విభాగం సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు.

బాలికతో అసభ్య ప్రవర్తన.. వ్యక్తిపై పోక్సో కేసు

అనంతపురం: బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిపై పోలీసులు 'పోక్సో' కేసు నమోదు చేశారు. వివరాలు.. నగరంలోని ఓ ప్రాంతానికి చెందిన బాలిక తల్లిదండ్రులు వ్యాపారం నిమిత్తం రోజూ బయటకు వెళ్లేవారు. 9వ తరగతి చదువుతున్న బాలిక శనివారం సాయంత్రం 4 గంటలకు పాఠశాల నుంచి ఇంటికి వెళ్లింది. ఇంట్లో ఉన్న తాతకు కాఫీ చేసి ఇవ్వడానికి స్టవ్ వెలిగించింది. ఈ క్రమంలోనే గ్యాస్ లీకవుతోందని గమనించిన బాలిక... విషయాన్ని తన తాతకు చెప్పింది. వెంటనే ఆయన తమ ఇంటి సమీపంలో కిరాణా కొట్టు నిర్వహిస్తున్న శివారెడ్డి కుమారుడు ఆనందరెడ్డికి తెలియజేశాడు. ఈ క్రమంలోనే ఇంటి లోపలికి వెళ్లిన ఆనందరెడ్డి బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. విషయం ఎవరికీ చెప్పొద్దంటూ బెదిరించాడు. దీనిపై బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు 'పోక్సో' చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేశారు.

మహిళ అదృశ్యం

అనంతపురం: అవసరాలకు అడిగినా డబ్బు ఇవ్వలేదని భర్తపై భార్య అలిగి.. ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. అనంతపురం నగరంలోని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మదర్‌థెరీనా కాలనీలో నివాసం ఉంటున్న నారాయణ నాయక్ భార్య దేవీబాయి వారం రోజుల కిందట ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లల్లో వెతికినా , ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో భర్త నారాయణ నాయక్ ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

పశువులను తరలిస్తున్న కంటైనర్ల అడ్డగింత

నల్లచెరువు: మండల పరిధిలోని పెద్దయల్లంపల్లి సమీపంలో పశువులను అక్రమంగా తరలిస్తున్న నాలుగు కంటైనర్ వాహనాలు, లారీని గ్రామస్తులు శనివారం రాత్రి అడ్డుకున్నారు. గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై కంటైనర్లు ఆపిన గుర్తు తెలియని వ్యక్తులు వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించిన గ్రామస్తులు, కంటైనర్లలో ఏముందని ప్రశ్నించారు. ఇందుకు వారు సరైన సమాధానం చెప్పకపోవడంతో గ్రామస్తులకు అనుమానం వచ్చింది. కంటైనర్లను అడ్డుకొని చూడగా అందులో అక్రమంగా పశువులను తరిస్తున్నట్లు గుర్తించారు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం ఇచ్చినా వారి నుంచి ఎలాంటి స్పందనాలేదని తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య


హజరతయ్య (ఫైల్)

ఉరవకొండ: ఎదిగిన కొడుకులకు ఉద్యోగాలు రాకపోవడంతో కొంత కాలంగా తీవ్ర మనోవేదనకు గురైన ఓ వ్యక్తి అనారోగ్యం బారిన పడి శుక్రవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య రాజమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. ఉరవకొండ పట్టణంలోని మల్లేశ్వర టాకీసు వద్ద నివాసముంటున్న హజరతయ్య (53), రాజమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. అనంతపురం బైపాస్ వద్ద సిమెంట్ బ్రిక్స్, రింగులు విక్రయిస్తూ హజరతయ్య జీవనం సాగించేవాడు. వ్యాపారం చేస్తున్న పెద్దకుమారుడితో పాటు కుమార్తెకు హజరతయ్య వివాహం చేశాడు. అయితే ఇద్దరు కుమారులకు ఉద్యోగాలు రాకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన హజరతయ్య అనారోగ్యం బారిన పడ్డాడు. ఈ నేపథ్యంలో తాను వ్యాపారం చేసే షాపులోనే ఫ్యానుకు ఉరేసుకొని మృతి చెందాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారి

అనంతపురం రూరల్: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి అన్నారు. శనివారం నగరంలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పట్ల విద్యార్థులు గౌరవంగా మెలగాలన్నారు. విద్యార్థి దశ నుంచే కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలన్నారు. వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, విద్యార్థినులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఏబీసీడబ్ల్యూఓ సుభాషిణి, వార్డెన్లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని డ్రైవర్ మృతి


మృతుడు మునీర్

గుత్తి రూరల్: మండలంలోని కరిడికొండ గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని బస్సు డ్రైవర్ మహమ్మద్ మునీర్ (48) మృతి చెందాడు. పోలీసుల వివరాలమేరకు.. హైదరాబాదులోని శివరాంపల్లి ఆదర్శనగర్‌కు చెందిన మునీర్... ట్రాన్స్ ఇండియా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్‌గా పని చేసేవాడు. ఈ క్రమంలో బెంగళూరుకు ప్రయాణికులతో వెళ్తున్న బస్సు శనివారం వేకువజామున కరిడికొండ శివారులోకి రాగానే టైరు పంక్చర్ అయింది. డ్రైవర్ మునీర్ బస్సును రోడ్డు పక్కన ఆపి మరో డ్రైవర్‌తో కలిసి టైరు మారుస్తుండగా అనంతపురం వైపునకు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి కొట్టి వెళ్లిపోయింది. మునీర్ తీవ్రంగా గాయపడగా మరో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. మునీర్‌ను 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడ. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఇదేనా ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం అంటే ?


మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెప్పిన ప్రజాప్రతినిధులు...అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా కనీస సమస్యలు పరిష్కంచలేదు. ఇదేనా ఫ్రెండ్లీ ప్రభుత్వం అంటే? అని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నాయకులు మండిపడ్డారు. శనివారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిటీని నియమించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవులు, రిటైర్డ్ అయిన వారికి ఇవ్వాల్సిన ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో ఇవ్వడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన 57 మెమో ప్రకారం 2003 డీఎస్సీ వారిని పాత పెన్షన్ విధానంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య, సహాధ్యక్షురాలు సరళ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళలపై పెరిగిన హింస



ఐద్వా సమావేశంలో పాల్గొన్న నేతలు

అనంతపురం టవర్‌క్లాక్: మహిళలపై హింస పెరుగుతోందని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ఎన్జీవో హోంలో ఐద్వా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రమాదేవి మాట్లాడుతూ.. మహిళా సమానత్వం ఇంకా రాని నేపథ్యంలో పాలకులు సనాతన ధర్మాన్ని అనుసరిద్దామంటూ చెబుతుండడం ప్రమాదకరమన్నారు. ఐద్వా రాష్ట్ర మహాసభలను అక్టోబర్ 13,14,15 తేదీల్లో అనంతపురం నగరంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రవికాంత్ రమణ, స్నేహలత, డాక్టర్ అరుణ, పద్మజ, పద్మావతమ్మ, రాచపాల్యం చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



మాట్లాడుతున్న రమాదేవి

అనంతపురం అర్బన్: మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి డిమాండ్ చేశారు. సెప్టెంబరు 13,14 తేదీల్లో అనంతపురంలో మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నామన్నారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సదస్సులో ఆమె మాట్లాడారు. పెరిగిన ధరలకనుగుణంగా మెనూ చార్జీలు పెంచడం లేదన్నారు. బిల్లులు, వేతనాల నెలలుగా పెండింగ్‌లో ఉంటున్నాయన్నారు. ఒక్కొక్క విద్యార్థికి మెనూ చార్జీ రూ.20 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే వంట గ్యాస్ సరఫరా చేయాలన్నారు. ప్రమాదంలో కార్మికులు చనిపోతే రూ.20 వేల పరిహారం ఇవ్వాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నాగమణి, నాగేంద్రకుమార్, నాయకులు రమణయ్య, కార్మిక సంఘం నాయకురాళ్లు పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత వెంగమనాయుడు



వెంగమనాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం అర్బన్: భూస్వామ్య వ్యతిరేక పోరాటాల్లో జీవితాన్ని అర్పించిన విప్లవ నాయకుడు వెంగమనాయుడు స్ఫూర్తిప్రదాత అని, ఆయనను ఆదర్శంగా తీసుకుని ప్రతి కార్యకర్త ప్రజాసమస్యలపై ఉద్యమించాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో వెంగమనాయుడు 28వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ పేదల పక్షాన నిలిచి వెంగమనాయుడు పోరాటాలు సాగించారన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణ స్వామి, మల్లికార్జున, నాయకులు రామకృష్ణ, కేశవరెడ్డి, పద్మావతి, లింగమయ్య, రమణ, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీ

అనంతపురం: నగరంలోని శ్రేయ ఆసుపత్రి వద్ద పార్కింగ్ చేసిన బైక్ చోరీకి గురైంది. బాధితుడు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాలు.. ఈ నెల 5న కూడేరు మండలం కమ్మూరు గ్రామానికి చెందిన మల్లేష్ తన కుమార్తె పుష్ప కాన్పు నిమిత్తం శ్రేయ ఆసుపత్రికి వచ్చాడు. రాత్రి బైక్‌ను ఆసుపత్రి పరిసరాల్లో పార్క్ చేసి నిద్రపోయాడు. తెల్లవారుజాము 3 గంటల సమయంలో లేచి చూస్తే బైకు కనపడలేదు. వారం పాటు వెదికినా బైక్ జాడ కానరాలేదు. శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

'అడ్డ'దిడ్డం.. అంతా మా ఇష్టం



ఆస్పత్రి ముందు గేట్‌ను ఆక్రమించిన ఆటో డ్రైవర్లు



పరిసరాలను ఆక్రమించిన అంబులెన్స్‌లు

- జీజీహెచ్ పరిసరాల దురాక్రమణ

అనంతపురం కార్పొరేషన్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి పరిసరాలు ఆటోస్టాండ్లు, అంబులెన్స్‌లు, తోపుడు బండ్లతో ఆక్రమణకు గురయ్యాయి. ఆస్పత్రి గేట్లను సైతం ఆక్రమించి రెండు ఆటోస్టాండ్లను ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది. అదేవిధంగా అంబులెన్స్‌లకు ఫ్లై ఓవర్ కింద వైపు ఉంచేలా గతంలో చర్యలు తీసుకున్నా.. మళ్లీ అంబులెన్స్‌లను ఆస్పత్రి ముందే ఉంచుతున్నారు. అసలు రోగులు, వారి సహాయకులు వెళ్లేందుకు వీలు లేకుండా ఆస్పత్రి ముందు ఆటోలను అడ్డంగా ఉంచారు. ఆటో నిర్వాహకులు రోగులు, వారి సహాయకులను తరలించేందుకు వందల రూపాయలు వసూలు చేస్తున్నారు. అక్కడ మరో ఆటో వచ్చి రోగులను తీసుకు వెళ్లేందుకు వీలు లేని పరిస్థితి. ఇక 20కిపైగా తోపుడుబండ్లు ఇతర వాహనాలను ఉంచారు. నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇదిలా ఉంటే ఆస్పత్రి ముందు తోపుడు బండ్లు, బంకులు ఏర్పాటు చేసుకున్న వారితో ట్రాఫిక్ పోలీసులు ప్రతి నెలా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఆస్పత్రి ముందు నుంచి రామ్ నగర్, రుద్రంపేట, అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు రోజూ వేలాది మంది వాహనదారులు, పాదచారులు వెళ్తుంటారు. ఇటువంటి తరుణంలో ఆస్పత్రి ఆరుబయటే వాహనాలను ఉంచడం ట్రాఫిక్‌కు సమస్యగా మారింది. కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి కూత వేటు దూరంలో ఇలాంటి పరిస్థితి ఉన్నా..టౌన్ ప్లానింగ్ అధికారులు, పోలీసులు అటువైపు చూడడం లేదు.



ఆస్పత్రి ముందు మరో ప్రవేశమార్గంలో ఆటో స్టాండ్

ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం ఎడ్యుకేషన్: నిరుద్యోగ యువత ఆత్మవిశ్వాసంతో ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వినోద్ కుమార్ సూచించారు. శనివారం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు చెందిన 'అంబికా ఫౌండేషన్' ఆధ్వర్యంలో నగర శివారులో నిర్వహించిన జాబ్ మేళాకు కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలు పొంది ఆత్మ విశ్వాసంతో ముందుకెళ్లాలన్నారు. లక్ష్యాలు సాధించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీ తనయుడు జీవీ వీక్షిత్, మాజీ మేయర్ స్వరూప, న్యాయవాది పరిటాల శైలజ, వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

సమ్మోహనం.. నృత్యోత్సవం



నృత్యం చేస్తున్న కళాకారులు

అనంతపురం కల్చరల్: అనంత నాట్య ఖ్యాతిని ద్విగుణీకృతం చేస్తూ రెండు రోజుల పాటు సాగనున్న నృత్యోత్సవ వేడుకలు శనివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు స్థానిక కళాకారుల నాట్య విన్యాసాలు అబ్బురపరిచాయి. 19 మంది చిన్నారులు తమదైన నృత్యకౌశలాన్ని ప్రదర్శిస్తూ చేసిన శాస్త్రీయ నృత్యాలు సమ్మోహనపరిచాయి. స్థానిక రామచంద్రానగర్‌లోని టీటీడీ కల్యాణ మండపం వేదికగా నృత్యకళానిలయం వ్యవస్థాపకులు నాట్యాచార్యులు సంధ్యామూర్తి నేతృత్వంలో జరిగిన తొలిరోజు వేడుకలను డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, హైదరాబాదు నుంచి విచ్చేసిన నాట్యాచార్యులు శ్రీనివాస్, కార్పొరేటర్ ఆబూ సాలెహ, ఆచార్య సుధాకర బాబు, బ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీనిధి రఘు, నృత్యకళానిలయం నందకుమార్ తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఆదివారం 12 గంటల పాటు నిర్విరామంగా జాతీయ స్థాయి కళాకారులతో, కళారూపాలతో నాట్యోత్సవం సాగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

ప్రశాంతంగా వైద్యుల రిజిస్ట్రేషన్



రిజిస్ట్రేషన్ పత్రాన్ని అందిస్తున్న ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ దగ్గుమాటి శ్రీహరిరావు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాలలో శనివారం వైద్యుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు రిజిస్ట్రేషన్ సేవలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వైద్యులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే విజయవాడకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. అయితే ఇప్పుడు ప్రతి జిల్లాలో రెండురోజుల పాటు రిజిస్ట్రేషన్ చేసుకునే సౌలభ్యాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు. అనంతరం రిజిస్ట్రేషన్ పత్రాలను వైద్యులకు అందించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ తెలుగు మధుసూదన్, డాక్టర్ శంకర్, డాక్టర్ షంషాద్‌బేగం, సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు బాబూ?

అనంతపురం అర్బన్: నిరుద్యోగ యువతకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు బాబూ? అంటూ ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్‌కుమార్ నిలదీశారు. హామీలను అమలు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 14న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం తలపెట్టామన్నారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 'సూపర్ సిక్స్' అమలును కూటమి ప్రభుత్వం విస్మరించిందని మండిపడ్డారు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతిని తక్షణం అమలు చేయాలన్నారు. ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో నిరుద్యోగులు, యువత పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కోట్రేష్, ఉపాధ్యక్షుడు ధనుంజయ, దేవేంద్ర, నగర అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, ఆనంద్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ దుర్మరణం

రాప్తాడు: మండల కేంద్రం రాప్తాడులో పండమేరు బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురంలోని కళ్యాణదుర్గం బైపాస్ సర్కిల్ సమీపంలోని పీఎస్ఆర్ కాలనీకి చెందిన శ్రీనివాసులు కుమారుడు సాయికుమార్ (23) ఆటో డ్రైవర్. శనివారం రాత్రి రాప్తాడు నుంచి అనంతపురం వెళ్తుండగా పండమేరు బ్రిడ్జిపై ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన సాయికుమార్‌ను 108 అంబులెన్స్‌లో అనంతపురం సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో సాయికుమార్ మృతి చెందాడు. ఇతనికి భార్య ఉంది.





నేడు చర్చా వేదిక

అనంతపురం కల్చరల్: ఆర్టీటీ ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ పునరుద్ధరణ అంశంపై రచయితలు, కవులు, మేధావులతో ఆదివారం ఉదయం 9.30 గంటలకు స్థానిక ఉపాధ్యాయ భవన్ వేదికగా చర్చా వేదిక నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ అంశాలపై డాక్టర్ శాంతినారాయణ, వెంకటరెడ్డి రెడ్డప్పరెడ్డి, ఉప్పర పాటి వెంకటేసులు, వహాబ్‌ఖాన్, హనుమంతరాయుడు, ఆదవాల శేషగిరిరాయుడు తదితరులు ప్రసంగిస్తారన్నారు. సమావేశంలో సాహిత్యాభిమానులు తమ అభిప్రాయాన్ని వెల్లడించడానికి తరలి రావాలని కోరారు.

'వెల్‌డన్ ప్రసన్న..'

అనంతపురం మెడికల్: 'వెల్‌డన్ ప్రసన్న..ఇదే స్ఫూర్తితో మరింత ప్రతిభ చూపాలి' అంటూ అనాటమీ పీజీ విద్యార్థిని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా అభినందించారు. ఈ నెల 5 నుంచి 6 తేదీ వరకు మంగళగిరిలోని ఎయిమ్స్ లో ఏపీ రాష్ట్ర అనాటమీ వైద్యుల సదస్సు జరిగింది. అందులో పోస్టర్ ప్రెజెంటేషన్‌లో అనాటమీ విభాగం ద్వితీయ సంవత్సరం పోస్టు గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థి డాక్టర్ ప్రసన్న ప్రథమ బహుమతి సాధించారు. శనివారం కళాశాలలో డాక్టర్ ప్రసన్నను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో అనాటమీ హెచ్‌ఓడీ డాక్టర్ ఉమమహేశ్వరావు, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ నరేంద్ర నాయక్, డాక్టర్ అహ్మద్ పీరా, డాక్టర్ పద్మజ, డాక్టర్ సహజీర్, డాక్టర్ భాను తదితరులు పాల్గొన్నారు.

నేడు బతుకమ్మ, నవశక్తి పూజలు

అనంతపురం కల్చరల్: ఆవోపా (ఆర్యవైశ్య అఫిషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్) మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం 10 గంటలకు నవశక్తి పూజలు, శాకంబరీ ఉత్సవం, పాతకాలపు ఆటలు, కొత్త ఆవకాయ భోజనం, బతుకమ్మ వేడుక వంటి వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కళ్యాణదుర్గం రోడ్డులోని శ్రీశివశక్తి ఆలయం వేదికగా సాగే వేడుకల్లో అందరూ పాల్గొనాలని నిర్వాహకులు గూడూరు అనురాధ శనివారం ఒక ప్రకటనలో కోరారు.

సంక్షిప్త సమాచారం

వడ్డీ వ్యాపారులకు అడ్డుకట్ట వేయలేరా?



మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: వడ్డీ వ్యాపారుల ఆగడాలు శృతి మించుతున్నాయని వారికి పోలీసులు అడ్డుకట్ట వేయలేరా అని వైఎస్సార్‌సీపీ శింగనమల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వడియంపేట మంత్రి ఆంజనేయులు అన్నారు. శనివారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వడియంపేట మంత్రి ఆంజనేయులు మాట్లాడుతూ వడ్డీ వ్యాపారులు ముఠాగా ఏర్పడి ఆగడాలు సాగిస్తున్నారన్నారు. బాధితులు పోలీసులను ఆశ్రయించినా ఫలితం ఉండడం లేదన్నారు. శుక్రవారం ఐలమ్మ కాలనీకి చెందిన మహబూబ్ బాషా అధిక వడ్డీ వ్యాపారుల ఇబ్బందులు తాళలేక వాస్‌మోల్ తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. ఇప్పటికైనా తమిళనాడు రాష్ట్రం తరహాలో చట్టం తీసుకురావాలని, లేదంటే ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మాజీ నగర అధ్యక్షుడు సాకే శివ శంకర్, గిరిజన నాయకుడు మల్లికార్జున నాయక్ తదితరులు పాల్గొన్నారు.





భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతాలు

అనంతపురం కల్చరల్: స్థానిక శారదానగర్‌లోని శృంగేరీ శారదాపీఠంలో ఏడు శనివారాల వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లోక కల్యాణార్థం జరుగుతున్న ఏడు శనివారాల వ్రతాలు నగరంలోని హౌసింగుబోర్డు వేంకటేశ్వరస్వామి ఆలయంలో,ఆర్ఎఫ్‌రోడ్డులోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ ఘనంగా జరిగాయి. పెద్ద ఎత్తున తరలి వచ్చిన మహిళలు ఏకరూప వస్త్రాలతో బారులు తీరి భక్తిశ్రద్ధలతో వ్రతమాచరించారు. శ్రీవారి ప్రతిమలకు పసుపు, కుంకుమ, పవిత్ర జలాలు, పుష్పాలతో మహిళలు పూజలు నిర్వహించారు. అంతకు ముందు మూలవిరాట్టుకు సుప్రభాత సేవ, తిరుమంజన, తోమాల సేవ, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

15న చలో విజయవాడ

అనంతపురం అర్బన్: మునిసిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 15న చలో విజయవాడ కార్యక్రమం తలపెట్టామని ఏపీ మునిసిపల్ వర్కర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్‌గౌడ్ అన్నారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. నెల రోజులుగా కార్మికులు పోరాటం చేస్తున్నా కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోందని మండిపడ్డారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కేంద్రం చెబుతున్నా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు, వాచ్‌మెన్‌లను ఫుల్‌టైమ్ వర్కర్లుగా గుర్తించి రూ.21 వేల వేతనం ఇవ్వాలన్నారు. 15న చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, మునిసిపల్ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, కోశాధికారి వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు నాగరాజు, నాయకులు నాయుడు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.